## క్లుప్తంగా

### డిచ్‌పల్లి సీఐగా వినోద్ రెడ్డి



**డిచ్‌పల్లి:** డిచ్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కాడారి వినోద్ రెడ్డి శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీలలో భాగంగా ఖమ్మం జిల్లా ట్రాన్స్‌కో విభాగంలో సీఐగా పని చేస్తున్న వినోద్‌రెడ్డి డిచ్‌పల్లి సీఐగా బదిలీపై వచ్చారు. ఇదివరకు డిచ్‌పల్లి సీఐగా పని చేసిన కొంక మల్లేష్ ఐజీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీఐ మాట్లాడుతూ.. ఏవైనా సమస్యలు ఉంటే బాధితులు పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. బాధ్యతలు స్వీకరించిన సీఐ వినోద్‌రెడ్డిని ఎస్సై మహ్మద్ షరీఫ్, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

### జాదూ రంగనాథ్‌కు సన్మానం



**నిజామాబాద్ రూరల్:** జాదూ యుగంధర్ రంగనాథ్‌ను జిల్లా బాలభవన్ సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించారు. తెలుగువారి ఆహ్వానం మేరకు పశ్చిమ అమెరికా వెళుతున్న సందర్భంగా రంగనాథ్‌ను ఘనంగా సన్మానించారు. బాలభవన్‌కు ఆయన చేసిన సేవలను కొనియాడారు. బాలభవన్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఉమాబాల, విశ్రాంత ఉద్యోగి విఠల్ ప్రభాకర్, వెంకటలక్ష్మి, లక్ష్మణ్, పుష్పలత, లలిత పాల్గొన్నారు.

### టీపీసీసీ అధ్యక్షుడికి..



**నిజామాబాద్ నాగారం:** మాలలకు మంత్రి వర్గంలో స్థానం కల్పించినందుకు టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ని మాల మహనాడు ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కలిసి ఘనంగా సన్మానించారు. సంఘం జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య, నాయకులు గడుగు గంగాధర్, ఎడ్ల నాగరాజ్, వెంకటేష్, ఎల్లయ్య, అలుక కిషన్, దేవదాస్, వినయ్, గంగాధర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన



**డిచ్‌పల్లి:** వెస్లీనగర్ తండాలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను శుక్రవారం ఎంపీడీవో బూక్య లింగం నాయక్ పరిశీలించారు.ఆయన మాట్లాడుతూ.. వెస్లీనగర్ తండాకు చెందిన ఏడుగురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కా గా అందులో ఆరు ఇళ్ల నిర్మాణ పనులు చు రుగ్గా కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్రంలో సొంత ఇళ్లు లేని పేదలు ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. మాజీ సర్పంచ్‌లు అంబర్ సింగ్, బోడ సునీత రఘు, పంచాయతీ కార్యదర్శి శ్రావణి, లబ్ధిదారులున్నారు.

### ఆర్థిక సహాయం

**పెర్కిట్(ఆర్మూర్):** ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామానికి చెందిన బట్టు నాగార్జున కుటుంబానికి గౌడ సంఘం ఆర్మూర్ మండల అధ్యక్షుడు గడ్డమీది లింగం గౌడ్ శుక్రవారం రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామానికి చెందిన నాగార్జున నెల రోజుల క్రితం బతుకుదెరువు కోసం అబుదాబి వెళ్లి అదృశ్యమయ్యాడు. దీంతో లింగం గౌడ్ బాధిత కుటుంబ సభ్యులకు చేయూతనందిస్తూ ఆర్థిక సహాయం చేశారు. బీజేవైఎం మండల అధ్యక్షుడు వేల్పుల సతీష్, మేడిపల్లి సాగర్, వేల్పుల లక్కీ, మేడిపల్లి గిరీష్, రాజు, రాఘవ పాల్గొన్నారు.

### బంగారం ధరలు (10గ్రాములు)

| | | | |
|---|---|---|---|
| 24 క్యారెట్స్ | 99,400 | వెండి(కిలో) | 1,08,000 |
| 22 క్యారెట్స్ | 91,945 | - నిజామాబాద్ బిజినెస్ | |

### మాంసం ధరలు

| | | | |
|---|---|---|---|
| చికెన్ | ధరలు | డ్రెస్డ్ | 200 |
| | (కిలోకు) | లైవ్ | 160 |
| స్కిన్‌లెస్ | 240 | మటన్ | 800 |

### కూరగాయల ధరలు(రూ.)

| | హోల్‌సేల్ | రిటైల్ | | హోల్‌సేల్ | రిటైల్ |
|---|---|---|---|---|---|
| టమాట | 20 | 40 | క్యాప్సికం | 50 | 90 |
| బెండకాయ | 30 | 50 | గాజరుగడ్డ | 30 | 60 |
| బీరకాయ | 50 | 70 | పచ్చిమిర్చి | 30 | 50 |
| దొండకాయ | 25 | 50 | దోసకాయ | 20 | 40 |
| బిర్నీసుకాయ | 100 | 150 | ఆలుగడ్డ | 30 | 50 |
| కాకరకాయ | 30 | 50 | గోబిగడ్డ | 10 | 20 |
| వంకాయ | 30 | 60 | గోబిపువ్వు | 50 | 80 |
| పాలకూర | 80 | 120 | బీట్‌రూట్ | 30 | 60 |
| మెంతికూర | 100 | 140 | కరివేపాకు | 40 | 60 |
| కొత్తిమీర | 40 | 60 | చామగడ్డ | 30 | 50 |
| పుదీనా | 70 | 100 | చిక్కుడుకాయ | 40 | 60 |

-సుభాష్‌నగర్

# ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి

- ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలి
- ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డికి వినతి పత్రం అందజేసిన పీడీఎస్‌యూ నాయకులు

**నిజామాబాద్ రూరల్:** రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. నగరంలోని కంఠేశ్వర్‌లో గల రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో నర్సరీ నుంచి ఇంటర్ వరకు ప్రైవేట్ విద్యా సంస్థలు రూ.లక్షల్లో ఫీజులను విద్యార్థుల నుంచి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ముక్కు పిండి వసూలు చేస్తున్నారని, బుక్స్, యూనిఫామ్, షూ, ల్యాబ్, ఈవెంట్స్, సైన్స్ ఫెయిర్ వంటి రకరకాల పేర్లతో ఫీజుల దోపిడీ చేస్తున్నారని, వీటిని నియంత్రించడానికి ఫీజుల నియంత్రణ చట్టం రాష్ట్ర ప్రభుత్వం తీసుకురావాలని అన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాలలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొని ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలన్నారు. ఫీజుల నియంత్రణపై అధ్యయనం చేసిన తెలంగాణ విద్యా కమిషన్ 'తెలంగాణ ప్రైవేట్ అండ్ ఎయిడెడ్ స్కూలు రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ ముసాయిదా బిల్లు 2025' పేరిట జనవరి 24న రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిందని గుర్తు చేశారు. పేద విద్యార్థులు చదువుకునే ఇంటర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలని కోరారు. అనంతరం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డికి ఎమ్మెల్యే కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సమస్యలపై ఎమ్మెల్యే భూపతిరెడ్డి స్పందిస్తూ.. డిమాండ్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని హామీ ఇచ్చారు. నాయకులు మనోజ్, సాయికిరణ్, రాజు, చరణ్ తేజ, రెడ్డి, వంశీ, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి చిత్రం



### గుంతపూడ్చేది ఎప్పుడు సారూ..?

నిజామాబాద్‌రూరల్: నగరంలోని 13వ డివిజన్ సారంగాపూర్‌లో ప్రధాన రహదారిపై చాలా రోజుల క్రితం గుంత ఏర్పడింది. ఈ మార్గంలో నిజామాబాద్ నుంచి బోధన్‌కు వెళ్లే ప్రయాణికులు రాత్రివేళల్లో గుంతను గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారు. గతంలో ఎన్నోసార్లు సమస్య గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు. ఇప్పటికైన అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని కోరుతున్నాం.

– అక్బర్ నవాజుద్దీన్, 13వ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు

**మాకు ఫొటో పంపండి**

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

నిజామాబాద్ అర్బన్ - 95531 30597 నిజామాబాద్ రూరల్ - 97053 46541

# భూ భారతితో సమస్యలు పరిష్కారం



ధర్పల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ శాంత



మునిపల్లిలో.. తహసీల్దార్ కిరణ్మయి

**ధర్పల్లి:** భూభారతి చట్టంతో రైతుల భూ సమస్యలను పరిష్కారమవుతాయని తహసీల్దార్ శాంత అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. దరఖాస్తులను రైతుల నుంచి స్వీకరించారు. ఇప్పటివరకు మండలంలో 892 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. ఆర్ఐ రాజేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

**మునిపల్లిలో..**

**జక్రాన్‌పల్లి:** మునిపల్లిలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కిరణ్మయి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిన్న సాయిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సాయన్న, రైతులు పాల్గొన్నారు.



ఘన్‌పూర్‌లో మాట్లాడుతున్న తహసీల్దార్ సతీష్ రెడ్డి

**డిచ్‌పల్లి:** గత పదిరోజులుగా డిచ్‌పల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు శుక్రవారం సాయంత్రం ముగిసినట్లు తహసీల్దార్ సతీష్ రెడ్డి తెలిపారు. ఘన్‌పూర్ జీపీ కార్యాలయంలో నిర్వహించిన సదస్సులో తహసీల్దార్ సతీష్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు. 35 మంది నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

## సామూహిక అక్షరాభ్యాసం



డిచ్‌పల్లి ప్రైమరీ పాఠశాలలో పిల్లలతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

**డిచ్‌పల్లి:** మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించినట్లు ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అనంతరం ఎంఈవో పిల్లలతో కలిసి సహపంక్తి (మధ్యాహ్న) భోజనం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందజేస్తారని ఆయన తెలిపారు.

**కోటగల్లీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో..**

**నిజామాబాద్ అర్బన్:** బడి బాటలో భాగంగా శుక్రవారం కోటగల్లీ శంకర్ భవన్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాలవేసి పూజలు చేశారు. కోటగల్లి కాంప్లెక్స్ హెడ్మాస్టర్ మల్లేశం, సవిత, మమత, సౌందర్య, ముకుంద్, సంతోష్, నందిని, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆధార్ సీడింగ్ పూర్తి చేయాలి

**డిచ్ పల్లి :** వీలైనంత త్వరగా ఉపాధి కూలీలకు సంబంధించి ఆధార్ సీడింగ్ పూర్తి చేయాలని, సోషల్ ఆడిట్‌లో వచ్చిన ఆరోపణలను త్వరగా పరిష్కరించాలని డిచ్‌పల్లి ఎంపీడీవో బూక్య లింగం నాయక్ ఆదేశించారు. శుక్రవారం డిచ్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నందున వనమహోత్సం కార్యక్రమానికి ఏర్పాట్లు చేసుకోవాలని, ఇందు కోసం గ్రామ నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్న లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతను తప్పకుండా నిర్మించుకునేలా చూడాలన్నారు. ఇంకుడు గుంత, మరుగుదొడ్డి లేని ఇళ్లు ఉం



ఈజీఎస్ సిబ్బందితో సమావేశమైన ఎంపీడీవో

డకూడదని స్పష్టం చేశారు. ఈ నెల 17న పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉపాధి హామీ పనులపై మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈజీఎస్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్ సుధాకర్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు ఉమేష్ కుమార్, పరమేశ్వర్, సాయికుమార్, అరుంధతి, కంప్యూటర్ ఆపరేటర్లు అన్నపూర్ణ, అనూష తదితరులు పాల్గొన్నారు.

## నాయీబ్రాహ్మణులకు సబ్సిడీపై రుణాలు అందించాలి

**నిజామాబాద్‌నాగారం:** క్షౌర శాలలను ఆధునీకరించడానికి సబ్సిడీపై రుణాలు ఇవ్వాలని తెలంగాణ నగర నాయీబ్రాహ్మణ దుకాణదారుల యూనియన్ అధ్యక్షుడు దేశాయి గంగాధర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రోజుల్లో కులవృత్తులను నాశనం చేసే విధంగా నాయీ బ్రాహ్మణుల పొట్టగొట్టి ఇతర మతస్తులు మంగళి పనిచేస్తూ మమ్మల్ని రోడ్డుపాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర మతస్తులు హెయిర్ సెలూన్లు పెట్టకుండా మున్సిపల్ అధికారులు అనుమతి ఇవ్వకూడదన్నారు. యాభై ఏళ్లు పైబడిన నాయీ బ్రాహ్మణులకు ఆసరా పెన్షన్ ఇచ్చి, ఇందిరమ్మ ఇళ్లలో కొంత శాతం కేటాయించాలన్నారు.

# విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



సిరికొండ హైస్కూల్‌లో పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో మనోహర్ రెడ్డి

**సిరికొండ:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు పుస్తకాలను ఎంపీడీవో మనోహర్‌రెడ్డి పంపిణీ చేశారు. జీహెచ్ఎం సతీష్‌గౌడ్, ఆసిఫ్, ధర్పల్లి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

**జక్రాన్‌పల్లి :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను కాంగ్రెస్ నాయకులు కాటిపల్లి నర్సారెడ్డి, వినోద్ పంపిణీ చేశారు. హెచ్ఎం లింగన్న, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వసంతరావు, మైనార్టీ శాఖ అధ్యక్షుడు అక్బర్, నట్ట తిరుపతి, ఆకాష్, మాడవేరి శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**మోపాల్:** సిర్‌పూర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు దుస్తులు, నూతనంగా అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు ఎంఈవో గేమ్‌సింగ్ పంపిణీ చేశారు. గ్రామపెద్దలు ముత్యం, మధు, రజనీకాంత్, గంగాధర్, రాజేశ్వర్, ఉపాధ్యాయులు కాసర్ల నరేష్‌రావు, హజారే శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రోగులకు పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్లు

**నిజామాబాద్ నాగారం:** జాతీయ సర్జన్స్ వారోత్సవాల్లో భాగంగా ది అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా, ఐఎంఏ నిజామాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రాష్ట్ర సర్జన్స్ సంఘం ప్రెసిడెంట్ డాక్టర్ జీవన్‌రావు, ఏఎస్ఐ జిల్లా అధ్యక్షులు టి.నరేంద్ర.. శస్త్ర చికిత్స , వారి పూర్వ అనుభవాలు, ఆధునిక వైద్య విధానం, రోగులకు సేవ చేసే పద్ధతుల గురించి ప్రభుత్వ సర్జికల్ పీజీ వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రధాన కార్యదర్శి కేవీ భాస్కర్‌రెడ్డి, కోశాధికారి రాకేష్, డాక్టర్లు రమేష్, వెంకటరమణారెడ్డి, కౌశిక్, శ్రీలత, పీజీ సర్జన్స్ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

# మండల కార్యాలయాలకు వెళ్లేదెట్లా..?

**మోపాల్:** మండల కేంద్రంలోని తహసీల్, ఎంపీడీవో కార్యాలయాలకు వెళ్లేందుకు ప్రజలు తిప్పలు పడుతున్నారు. గురువారం ఉదయం కురిసిన వర్షానికి కార్యాలయాలకు వెళ్లే రోడ్డుపై వర్షపు నీరు నిలిచి మడుగులా తయారైంది. ఆఫీస్‌కు నడక దారిన వచ్చే వారికి ఇబ్బందిగా మారింది. నిత్యం పదుల సంఖ్యలో ప్రజలు కార్యాలయాలకు వస్తూ పోతుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

## అనుమతుల్లేకుండా అడ్మిషన్లు

- గోల్డెన్ జూబ్లీ కళాశాల అడ్మిషన్ల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి
- అల్ ముర్తజా ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్టు కార్యదర్శి నాదిర్ షా రజానీ

**నిజామాబాద్‌అర్బన్:** జిల్లా కేంద్రంలోని ఖిల్లా రోడ్డులోని గోల్డెన్ జూబ్లీ ఇంటర్మీడియట్ కళాశాలకు అనుమతులు లేకుండానే యాజమాన్యం అడ్మిషన్లు చేపడుతుందని అల్ ముర్తజా ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్టు కార్యదర్శి నాదిర్ షా రజానీ తెలిపారు. కళాశాలకు అల్ ముర్తజా ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్టు సంబంధించిన భవనాన్ని కొన్ని సంవత్సరాల క్రితం లీజుకు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. అయితే సంబంధిత లీజు గడువు ముగిసిందని, అంతేగాకుండా లీజు గడువు ముగిసినా ఎటువంటి ఒప్పంద ప్రక్రియ లేకుండానే జూనియర్ ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. లీజు గడువు ముగిసిన నేపథ్యంలో భవనాన్ని ఖాళీ చేయాలని ఇది వరకే నోటీసులు ఇచ్చామని తెలిపారు. ఈ విషయంలో వివాదం చెలరేగకుండా ట్రస్టు నుంచి న్యాయస్థానాన్ని ఆశ్రయించామని.. తీర్పు తమకే అనుకూలంగా వచ్చిందని తెలిపారు. ఈ విషయంపై ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామని, వారు నిజామాబాద్ డీఐఈవోకు విచారణకు ఆదేశించారని తెలిపారు. అడ్మిషన్ల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు. సమావేశంలో అల్ ముర్తుజా ఎడ్యుకేషన్ ట్రస్టు కోశాధికారి రజియాతో పాటు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ట్రస్టు కార్యదర్శి నాదిర్ షా రజానీ

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



చిన్నవాల్గోట్‌లో స్థానికులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రామ్

**సిరికొండ:** గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలని ఎస్సై ఎల్. రామ్ సూచించారు. మండలంలోని చిన్నవాల్గోట్‌లో మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ఎస్సై మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను పాడు చేసుకోవద్దన్నారు. ఎక్కడైనా ఎవరైనా గంజాయి, డ్రగ్స్ లాంటివి అమ్ముతుంటే 1908 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, తగిన పారితోషికం అందిస్తామని తెలిపారు.కాంగ్రెస్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, మహిపాల్, సాయారెడ్డి,లింబాద్రి,కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

**బానిసలు కావొద్దు**

**ధర్పల్లి:** యువత మత్తుకు బానిసలై తమ జీవితాలను బలి చేసుకోవద్దని ఎస్సై రామకృష్ణ సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం కమ్యూనిటీ ఔట్‌రీచ్ కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాలపై పోలీసులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాదకద్రవ్యాలు ఉపయోగించడం వల్ల కలిగే నష్టాలు, దుష్ప్రభావాలపై ప్రజలకు వివరించారు.

**నిజామాబాద్ రూరల్:** మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రూరల్ ఎస్‌హెచ్‌వో మహమ్మద్ ఆరిఫ్ తెలిపారు. శుక్రవారం నగరంలోని ఒకటో డివిజన్ ఖానాపూర్లో గంజాయి, మత్తు పదార్థాల నివారణ, రోడ్డు భద్రత గురించి ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్‌హెచ్‌వో మాట్లాడుతూ.. ప్రయాణికులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు.

## నేడు రాజ్యాంగం, మన విశ్వంపై శిక్షణాతరగతులు

**సుభాష్‌నగర్:** నగరంలోని జిల్లా పరిషత్ వద్ద గల పెన్షనర్స్ అసోసియేషన్ హాల్‌లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాజ్యాంగం, మన విశ్వం, జేవీవీ చరిత్ర అంశాలపై శనివారం ఉదయం 10 గంటలకు శిక్షణా తరగతులు ఉంటాయని జేవీవీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోయేడి నర్సింహులు, గంగాధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణాతరగతులకు విద్యార్థులు, యువత, సమాజ సేవకులు హాజరై సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## సినిమాలు

| |
|---|
| **ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)** |
| స్క్రీన్-1 తొలిప్రేమ-11.00,1.30,4.30,7.30, 10.30 |
| స్క్రీన్-2 అందాల రాక్షసి-11.00, 4.30 |
| హౌస్‌ఫుల్-5(హిందీ)-1.35, 7.30, 10.30 |
| హౌస్‌ఫుల్-5(హిందీ)-1.35, 7.30, 10.30 |
| స్క్రీన్-3 అందాల రాక్షసి-10.20 |
| **పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)** |
| స్క్రీన్-1 హౌటూట్రైన్ యువర్ డ్రాగన్ |
| (3డీ)-11.00, 1.45, 4.30 |
| హౌటూ ట్రైన్ యువర్ డ్రాగన్ |
| (3డీ ఇంగ్లీష్)-7.15,10.00 |
| స్క్రీన్-2 హౌస్‌ఫుల్-5(హిందీ)-10.10, 4.25 |
| జాన్ విక్-5-1.40 |
| జాన్ విక్-5(ఇంగ్లీష్)-7.55, 10.40 |
| ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్-1.10 |
| స్క్రీన్-3 ది హంటర్: చాప్టర్-1-11.10 |
| ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్-1.50 |
| జాన్‌విక్-5-4.20 |
| హౌస్‌ఫుల్-5(హిందీ)-7.05, 10.35 |
| పాడేరు 12 మైలు-8.00 |
| స్క్రీన్ -4 జాన్‌విక్-5-11.30 |
| కట్టప్ప జడ్జిమెంట్-2.15 - పాప-4.50 |
| అందాలరాక్షసి-7.35, 10.45 |
| దేవి తొలిప్రేమ నటరాజ్ హౌస్‌ఫుల్-5 (హిందీ) |

## పారిశుధ్యంపై అవగాహన



**నిజామాబాద్ సిటీ:**ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా నగరంలో పారిశుధ్య పనులు నిర్వహించారు.శుక్రవారం చంద్రశేఖర్ కాలనీ,వి నాయక్‌నగర్‌లో ర్యాలీ నిర్వహించారు.గౌతంనగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పారిశుధ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.ఇళ్లలో తయారైన చెత్తను వేరుచేయడం, చుట్టుపక్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం, దోమలు వ్యాప్తిచెందకుండా తీసుకునే జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.పలు డివిజన్లలో డ్రెయిన్‌లను శుభ్రం చేశారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ జయకుమార్, సూపర్‌వైజర్ సాజిద్ పాల్గొన్నారు.

## పరిశోధనలతోనే నూతన ఆవిష్కరణలు



గంగాధర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

**నిజామాబాద్ రూరల్ :** ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి తెలుగు సాహిత్యంలో డాక్టరేట్ అందుకున్న సారంగపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు ఎస్. గంగాధర్‌ను పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లలిత మాట్లాడుతూ.. పరిశోధనలతోనే నూతన ఆవిష్కరణలు జరుగుతాయని.. పరిశోధనలు ముందు తరాలకు మార్గ నిర్దేశం చేస్తాయని అన్నారు. 'తెలంగాణలో స్మృతి కవిత్వం- సమగ్ర పరిశీలన' అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ అందుకున్న గంగాధర్ తమ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు కావడం ఎంతో గర్వకారణమని అభినందించారు. ఆయన భవిష్యత్తులో విద్యార్థులను పరిశోధన వైపు దృష్టి సారించే విధంగా తీర్చిదిద్దుతారని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు సల్ల సత్యనారాయణ, రాధాకృష్ణ, డి.గోపాల్, జావిద్, విద్యాసాగర్, ఘనపురం దేవేందర్, కృష్ణంరాజు, సుజాత, స్వరూప, అనిత, లలిత, శ్రీలత పాల్గొన్నారు.

## ఉద్యోగ సాధనే లక్ష్యంగా సాగండి

**మాక్లూర్:** ఉద్యగ సాధనే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని, ఇంజినీరింగ్ పూర్తి చేసుకుని వెళ్తున్న విద్యార్థినులకు కాకతీయ మహిళా ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ రజినీకాంత్ సూచించారు. శుక్రవారం మా ణిక్‌భండార్ వద్దగల కాకతీయ మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో 3వ సంవత్సరం చదువుతున్న ఇంజనీరింగ్ విద్యార్థులు నాలుగో సంవత్సరం ఇంజినీరింగ్ పూర్తి చేసుకుని వెళ్తున్న విద్యార్థులకు అక్కడే ఉన్న ఓ ఫంక్షన్ హాల్లో ఫేర్‌వెల్ పార్టీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి రజినీకాంత్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా చదివి ఉద్యోగాలు సాధించాలన్నారు. విద్యార్థినుల నృత్యాలు అలరించాయి. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సెల్వరాజ్, వైస్ ప్రిన్సిపల్ జి.సాయరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో కళాశాల డైరెక్టర్ రజినీకాంత్, అధ్యాపకులు

**పత్రిక ప్రకటన**

ఇందుమూలంగా నిజామాబాద్ జిల్లా బిడ్డర్స్‌కు తెలియజేయునది ఏమనగా ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహం, ముదక్‌పల్లి, మండల్ ముగ్పాల్, జిల్లా నిజామాబాద్ యందు 14 నీలగిరి చెట్లను 17.06.2025 మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపీడీవో ముగ్పాల్, తహసిల్దార్ ముగ్పాల్, స్పెషల్ ఆఫీసర్ ముగ్పాల్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ముగ్పాల్, వసతి గృహ సంక్షేమ అధికారి ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహం, ముదక్‌పల్లి గార్ల సమక్షంలో వేలం పాట నిర్వహించాలని నిర్ణయించడమైనది.

చెట్లు నరికివేత సమయంలో ప్రభుత్వ భవనాలకు నష్టం కలగకుండా చెట్లు నరికివేసే ఆసక్తి కలిగిన బిడ్డర్స్ వేలం పాటలో పాల్గొనగలరని కోరడమైనది. షరతులు వర్తించును.

సం/- జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి, నిజామాబాద్.